# పీర్లు

పీర్ల పండగ ఒకరకంగా సాయిబూల పండగ్గానే కాక అందరికీ పండగాల్నే వుంటాది. ఒకరోజూ రొండ్రోజుల పండగా అది ? పీర్ల సాయిట్లో పీర్లన్నిలబెట్నకాన్నుంచీ గుండంలో పడేదాంకా రోజూ పండగే. పీర్లన్నిలబెట్న అయిదో రోజున సినసరిగేసు, అవతల మూడ్రోజులయినాక పెద సరిగేసూ, మల్ల గుండం .... అదయినాంక పీర్లు యేట్లో పడే రోజు. సిన సరిగేసునాడు సిన్న పీర్లను వూరేగిస్తే, పెద సరిగేసునాడు పెద్ద పీర్నూ, సిన్న పీర్లనూ అన్నిట్నీ వూరేగిస్తారు. ఇంగ గుండం నాడయితే.... వూరంతా పిల్లాజెల్లా ముసిలీముతకా సందకాడ బువ్వల్దిన్న కాన్నుంచీ తెల్లంగ తెల్లారేదాంకా గుండం కాన్నే వుంటారు. ఒకేసికాలేనా, ఒక గుండం తొక్కడాలేనా ... ఓయబ్బ ! యేం జెప్తావులే !

ఉత్తప్పుడు పీర్ల సాయిట్లో సుట్టుపక్కలోళ్ళు పెట్టుకోనుండే గొర్లూ, గుంటికెలూ యెవురెవురియో మ్యాకలూ దాంట్ల పెంటికలూ తప్ప యింగేముండవు. వూళ్ళో రామున్దేలంలో మల్లా యిట్ట గొర్లూ గుంటికెలూ పెట్టడం, మ్యాకలూ అయీ రోత జేయడం వుండదు. సుబ్బరంగానే వుంటాది. ఆడెవురన్నా అడుక్కుందోళ్ళు రొంత సేపున్నా, దేలమంతా రోత జేస్తా వుండారని సూసినోళ్ళంతా అర్సుతారు. అదే పీర్ల సాయిట్లో యేమన్నా రోతజేయి, పట్టిచ్చుకొనే వాడుండడు. పీర్ల పండగప్పుడు నాల్రోజులూ సాయిట్లో నుంచీ ఆ యారముట్లను బయటికి తీయనిస్తారా, పీర్లు అన్నించీ దాట్తానే మల్లా లోపలికొస్తాయి.

వూళ్ళో సాయిబూలు బీదోళ్ళయినట్టే వాళ్ళ పీర్లూ బీదయే, పీర్ల సాయిడీ బీద్దే. ల్యాకపోతే, ఉగాదీ, సంకురాతిరీ యిట్ట పండగలొచ్చినాయంటే, వూళ్ళో అందరూ పరిగెత్తి పరిగెత్తి పొద్దుటూరికి పోయి కొత్త గుడ్డలు కుట్టిచ్చుకోడం ఇరవై రోజుల ముందు నుంచీ మొదులయితాది. మిస్నీ కుట్టే వాళ్ళందరూ రాత్రీ పగులూ కుట్టినా అయిపోవు. పీర్ల పండగప్పుడు వొచ్చే కొత్త గుడ్డలయితే ఒక్క మిస్నీగ్గూడా సాలవు.

యియన్నీ నిజమే గానీ, పీర్ల పండగ మాత్రం అందరికీ పండగాల్నే వుంటాదనేది వుత్తది గాదు. సేలల్లో యిత్తనం పని అయిపోయి, అందరికీ పనుల్యాకుండా యిరామంగా వుండేతప్పుడు వొచ్చేదాన్నేమో! ఎట్టనో గానీ సాయిబూలకు యేమేం పండగలుండాయో వూళ్ళో మిగిల్నోళ్ళకు తెలకపోయినా, యీ పండగొకటీ అందరికీ తెల్చు, అందరూ కల్చుతారు. ఆరికెలిసిరే కాశింబీ, ఆమె సిన్న కొడుకు సెవులేని పిల్లోడూ పీర్ల సాయిటికి సున్నం గొడ్తారు. వాళ్ళట్టా సున్నం గొట్టేది సూస్తానే, 'ఒరే ! అప్పుడే మల్లా పీర్ల పండగొచ్చెనా?' అనుకొంటారు.

పెద్ద సెక్కపెట్టెలో కట్టగట్టి పండబెట్టిన పీర్లను గడ్డకు తీసి, ఏట్లోకి తీసకపోయి తలతలమని మెర్సిపోయేతట్టు తోంకోని తెచ్చి, రంగురంగుల జల్తారు గుడ్డలు కడ్తారు. ఆమొయిన అంత దూరానికి గుమాయిచ్చేతట్టూ అత్తరూ గందమూ యాందేందో సల్లుతారు. పెద్ద పీర్ను నట్టనడుమ నిలబెట్టి ఆ పక్కనా యీ పక్కనా సిన్న పీర్లను నిలబెట్తారు. పీర్లల్లో రెడ్డిదో, పెసిడెంటుదో ఒక పీరుంటాది. ఆ పీర్ను ముందుగా వూరేగిచ్చాల, మల్ల మిగతా పీర్లను వూరేగిచ్చాల. పండగప్పుడు గానీ మామూలప్పుడుగానీ లేనోడు లేనోడే, వున్నోడు వున్నోడే. అది యిందులో గూడా తెల్చుతాది. అందుకే రెడ్డీ, పెసిడెంటు

పీర్లు ముందుగా వూరేగుతే, ఎనకాల ఎర్రిపీర్లు వూరేగుతాయి. అయితే, యీ సంగతి యిట్టగాక యింగో రకంగా అగుపిచ్చేట్టు సేస్తారు. పెద్దోళ్ళ పీర్లు ముందు వూరేగడం వూరి గౌరువం అనుకునేట్టు సేస్తారు.

పీర్లు గుండంలో పడే లోపల సిన సరిగేసూ, పెద్ద సరిగేసూ జరుగుతాయా, యీ వూరేగింపులు కాక, రోజూ ఏసికాలేసుకోని ఆర్మేనిపెట్టె, పిటీలూ వాంచుకుంటా పాటలు పాడుకుంటా వూర్లో తిరుగుతారు. ఆదేసిక మేసే పీరా బుల్ బుల్ తారు వాంచుతా ద్యాంచుజేస్తే, ఆడా మొగా యిరగబడి సూసేవాళ్ళు. కమాల్ అయేంటియో పాటలు పాడ్తే, అర్తంగిర్తం తెలకపోయినా యింటా వుంటే వొళ్లు పులకరిచ్చేది. ఇంగ బాలేపీరాన్ పెదనాయిన బఫూన్ జెప్తే, పందిరి గుంజలు గూడా వూగి వూగి నగాల ! అప్పటికప్పుడు పాటలు గట్టి, దాంట్లకు రాగం తాలం కుదిరిచ్చి ఆయప్ప యెంత బాగ పాడేవాడని ! ఆయప్ప టేజీ ఎక్కి నిలబడ్తానే జనం నగబట్టేవాళ్ళు.

గుండంనాడయితే, పెద్దపెద్ద మొద్దుల్ని గుండంలో యేసి మంటలు మిద్దెత్తునా లేసేతట్టు తెల్లవార్లూ ఒక దిక్కున కాల్చుతా వుంటే, ఆ యెల్తర్లో రకరకాల ఏసికాలేసుకోని వస్తారు. ఒకసారి సేపలు పట్టేవాళ్ళ మాదిరి పుట్టగోసులు పెట్టుకోని జొలకలు[1] పట్టుకోని వస్తారు. ఇంగొకసారి సచ్చిన ఎనుమును కోసుకొంటా వుండే మాదిగోళ్ళ మాదిరి వస్తారు. వూరి పెద్దలకు ఎనుము సియ్యల్లో బాగా లేస్తారు ! మా రెడ్డికి యియి సాలవంటే యియి సాలవని కొట్టాడుకుంటా, మా రెడ్డి సగం ఎనుమును తింటాడని ఒకరంటే, మా రెడ్డి ఎనుమునంతా ఎంకల్తో గూడా తింటాడని యింగొకరంటా... నగిస్తారు. ఆ పెద్దోళ్ళు యిన్నా నగుతారు. తెల్లార్జామై రొండోసారి కోళ్ళు కూసేతలికల్లా యాడాడ తెచ్చిన మొద్దులూ కాలిపోయి గుండంలో యింతింత నిప్పులు లోపల ఎర్రగుండి, పైన బూడ్డి కప్పుకోని వుంటాయి. అప్పుడు పీర్లను ఎత్తుకోని గుండం తొక్కుతారు. తెల్లంగ తెల్లారేదాంకా ఒక్కొక్కరూ గుండం తొక్కుతానే వుంటారు.

మర్సనాడు పీర్లు ఏట్లో పడే రోజు. పీర్లను ఎత్తుకోని ఏట్లో దిగుతానే కొలిం జమాల్ నాయిన కట్టొర్స సేస్తాడు. వూర్జనమంతా వూపిరి తీయకుండా, కండ్లు మూయకుండా సూస్తారు. ముసిలోడైనా ఆయప్ప వొయిసోళ్ళను అట్టా వుడ్డాడిస్తా వుంటే, 'ముసిలోడైనా బసిరెడ్డే మేలు' అంటారు. సీకటిపడేతలికి పీర్లను ఏట్లో యిడ్సి, ఎనక్కి తిరిగి ఆల్బిదా పాడుకొంటా వూళ్ళోకొస్తారు.

అంతట్తో పీర్ల పండగయిపోతాది. పీర్లు మల్లా పెట్టెలోకి పోతాయి. అత్తరూ గందం పూసుకోని, తలతల మెర్సిపోయిన పీర్లు సెక్కపెట్టె సీకట్లో పడి సిలుం పట్టిపోతాయి. ఆ పీర్లను పట్టుకోని నిప్పుల మీంద నడ్సినోళ్ళు, కడుపు పట్టుకోని పని కోసం యెతుకులాడ్తా, దొరక్కపోతే పస్తులు పండుకొంటా వుంటారు. నాల్రోజులు బఫూన్ సెప్పి నగిచ్చిన బాల్పీరాన్ యాడాదంతా యేడుస్తా వుంటాడు. కట్టొర్స సేసే జమాల్ నాయిన కాళ్ళూ సేతులూ పడిపోయినోనాల కనిపిస్తా వుంటాడు. పీర్లున్నరోన్నాళ్ళూ పెలపెలలాన్న సాయిడి మల్లా దిక్కులేన్దానాల వుండిపోతాది.

1) చేపలను పట్టే అడుగులేని గంపలు